ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
ఆదివారం 18 ఫిబ్రవరి 2024



శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు 8లో..

8లో.. కార్మికులను మోసం చేసిన ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ



ఎల్లంపల్లి ప్యాకేజీ కోసం నిరీక్షణ

- 1,116 మంది బాధితులను గుర్తించిన రెవెన్యూ అధికారులు
- రెండేళ్ల క్రితమే రూ. 22.32 కోట్ల బడ్జెట్ కోసం ప్రభుత్వానికి నివేదిక
- పట్టించుకోని గత ప్రభుత్వం
- రాష్ట్ర ప్రభుత్వంపై ఆశలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

గోదావరి నదిపై నిర్మించిన శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో భాగంగా ముంపునకు గురైన గ్రామాల నిర్వాసిత కుటుంబాల్లో మైనార్టీ తీరిన వారికి ప్రకటించిన ప్యాకేజీ సొమ్ము నేటికీ కూడా విడుదల కాకపోవడంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు. రెండేళ్ల క్రితమే అధికారులు జిల్లాలోని ఏడు గ్రామాల్లో 1,116 మంది అర్హులను గుర్తించారు. ఇందులో ముర్మూర్ గ్రామంలో 170 మంది, ఎల్లంపల్లిలో 97 మంది, పొట్యాలలో 336 మంది, మద్దిర్యాలలో 66 మంది, కుక్కలగూడూరులో 101 మంది, ఉండేడులో 103 మంది, వేమునూర్‌లో 243 మంది ఉన్నట్లు గుర్తించారు. వారికి రెండు లక్షల రూపాయల చొప్పున 22 కోట్ల 32 లక్షలు విడుదల చేయాలని రెవెన్యూ శాఖాధికారులు రెండేళ్ల క్రితం గత ప్రభుత్వానికి నివేదికను సమర్పించారు. కానీ పరిహారం ఇంకా విడుదల కాలేదు. అసలు పరిహారం ఇస్తారా, ఇవ్వరా అనే అనుమానాలను బాధితులు వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో బాధితుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

జిల్లాలోని రామగుండం మండలం ఎల్లంపల్లి వద్ద గోదావరి నదిపై 2004లో 20.175 టీఎంసీల సామర్థ్యంతో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టారు. ఈ ప్రాజెక్టు కింద అంతర్గాం మండలం, ముర్మూర్, ఎల్లంపల్లి, పాలకుర్తి మండలం మద్దిర్యాల, పొట్యాల, కుక్కలగూడూర్, వేంనూర్ గ్రామాలతో పాటు జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం తాళ్లకొత్తపేట, చెగ్యాం, కోటిలింగాల గ్రామాలు, మంచిర్యాల జిల్లాకు చెందిన మరో తొమ్మిది గ్రామాలు పూర్తిగా ముంపునకు గురయ్యాయి. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి 2004లో శంకుస్థాపన చేయగా 2005, 2009లో భూ సేకరణకు నోటిఫికేషన్లు జారీ చేశారు. ముంపునకు గురవుతున్న గ్రామాల నిర్వాసితులకు వారు కోల్పోవుతున్న భూములకు, ఇళ్లకు పరిహారం చెల్లించి పునరావాసం కల్పించాల్సి ఉంటుంది. అలాగే నిర్వాసిత కుటుంబాల్లో 18 సంవత్సరాలు నిండిన వారికి ప్రత్యేక ప్యాకేజీని అందిస్తారు. అయితే భూ సేకరణలో, పునరావాసం కల్పించడంలో, ప్రాజెక్టు నిర్మాణంలో దశాబ్ద కాలం పట్టడంతో ఆయా కుటుంబాల్లో మైనారిటీ తీరిన వారికి కూడా ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని నిర్వాసితులు కొంతకాలంగా డిమాండ్ చేస్తూ వస్తున్నారు. ఈ విషయమై మాజీ రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్, రామగుండం మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చినప్పటికీ పట్టించుకోలేదు. తెలంగాణ ఏర్పాటై బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సదరు నేతలు సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ అంశాన్ని పరిశీలించిన సీఎం 2015 జనవరి 1వ తేదీ నాటికి ఎంత మంది 18 ఏళ్లు నిండిన వాళ్లు ఉన్నారనే విషయమై సామాజిక, ఆర్థిక సర్వేకు ఆదేశించారు. ఈ మేరకు పెద్దపల్లి జిల్లా పరిధిలో 3,127 మంది ఉన్నారని, మంచిర్యాల జిల్లాలో 1,974 మంది ఉన్నట్లు గుర్తించారు.

● 2017 జనవరిలో ఉత్తర్వులు జారీ చేసినా..

2016 సెప్టెంబరు, అక్టోబరు మొదటి వారంలో కురిసిన భారీ వర్షాలకు రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం మాన్వాడ వద్ద నిర్మిస్తున్న మిడ్ మానేర్ కట్టకు గండి పడింది. ఈ గండిని పరిశీలించేందుకు సీఎం కేసీఆర్ ఏరియల్ సర్వే నిర్వహించారు. అనంతరం కరీంనగర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో 2015, జనవరి 1వ తేదీ నాటికి శ్రీపాద ఎల్లంపల్లి, మిడ్‌మానేర్, గౌరవెల్లి ప్రాజెక్టుల నిర్వాసిత కుటుంబాల్లో మైనారిటీ తీరిన వారికి రెండు లక్షల చొప్పున ప్యాకేజీ ఇస్తామని ప్రకటించారు. ఆ మేరకు 2017 జనవరి 3వ తేదీన ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో 3,127 మందికి రెండు లక్షల చొప్పున 62 కోట్ల 54 లక్షల రూపాయలు, మంచిర్యాల జిల్లా పరిధిలోని ముంపు గ్రామాలకు చెందిన 1,974 మేజర్లకు 39 కోట్ల 48 లక్షల రూపాయలను మంజూరు చేసింది. అయితే సర్వే చేసిన జాబితాలను పరిశీలించి అందులో ఎంత మంది అర్హులున్నారు, ఎంత మంది అనర్హులున్నారో గుర్తించి అసలైన జాబితాను పంపించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆ మేరకు త్వరగా సర్వే చేసి జాబితాలను పంపించాల్సిన రెవెన్యూ శాఖాధికారులు తాత్సారం చేస్తూ వచ్చారు. దీనిపై రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ సైతం అధికారుల పై ఒత్తిడి తీసుకువచ్చారు. ముంపు కుటుంబాల జాబితాల ఆధారంగా అధికారులు పలుసార్లు సర్వే నిర్వహించారు. అనేక తీసివేతలు, కూడికల అనంతరం 1,116 మందితో తుది జాబితాను సిద్ధం చేశారు. వీరికి రెండు లక్షల చొప్పున 22 కోట్ల 32 లక్షల రూపాయల పరిహారం విడుదల చేయాలని జిల్లా అధికారులు ప్రభుత్వానికి నివేదించి రెండేళ్లు కావస్తున్నది. కానీ ఇప్పటి వరకు పరిహారం సొమ్ము విడుదల కాలేదు. దీంతో బాధితులు తరచూ కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరుగుతూ డబ్బులు వచ్చాయా, లేదా అని వాకబ్ చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బాధితులు ఆశలు పెంచుకున్నారు. పరిహారం ఇప్పించేందుకు జిల్లాకు చెందిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్ చొరవ చూపాలని బాధితులు కోరుతున్నారు.

కుటుంబ బాగోగులు చూడడం లేదని..
తండ్రిని చంపిన తనయుడు

- వివరాలు వెల్లడించిన ఏసీపీ జి కృష్ణ



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ కృష్ణ

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి 17: కుటుంబ బాగోగులు చూడడం లేదని తండ్రిని చంపిన తనయుని ఉదంతం శుక్రవారం రాత్రి మండలంలోని హన్మంతునిపేటలో జరిగింది. ఈ ఘటన సంబంధించిన వివరాలను ఏసీపీ గజ్జి కృష్ణ శనివారం తన కార్యాలయంలో వెల్లడించారు. గ్రామానికి చెందిన యదగిరి ఓదెలు (55) మ్యాట్రిమోనియల్ ఏజెంటుగా పని చేస్తున్నాడు. ఇద్దరు కూతుళ్ల వివాహం చేశాడు. కొడుకు రాజశేఖర్ ఐటీఐ పూర్తి చేసి ఇంటి వద్దే ఉంటున్నాడు. ఓదెలు తాగుడుకు బానిసగా మారి కుటుంబపోషణ పూర్తిగా పట్టించుకోవడం మానేశాడు. తాగి వచ్చి తరుచూ ఇంట్లో గొడవ పడేవాడు. తండ్రీకొడుకుల మధ్య చాలా సార్లు గొడవ జరిగింది. కొడుకు రాజశేఖర్ ఎంత చెప్పినా వినకపోవడంతో హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఓదెలు యథావిధిగా మద్యం సేవించి వచ్చి కొడుకుతో గొడవకు దిగాడు. అసహనానికి గురైన రాజేశఖర్ ఇంట్లో ఉన్న కూరగాయల కత్తితో చాతిలో, పొట్టలో పొడిచాడు. అధిక రక్తస్రావం జరగడంతో ఓదెలు అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. తమకున్న సమాచారంతో ఒక్క రోజు వ్యవధిలో రాజశేఖర్‌ను అదుపులోకి తీసున్నట్లు ఏసీపీ గజ్జి కృష్ణ తెలిపారు. కేసు త్వరలో ఛేదించిన సీఐ కృష్ణ, ఎస్సైలు లక్ష్మణ్‌రావు, మల్లేష్‌లను ఏసీపీ అభినందించారు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చనున్నట్లు తెలిపారు.

ర్యాగింగ్‌తో విద్యార్థుల జీవితాలు బుగ్గిపాలు

కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 17: ర్యాగింగ్ అనేది విషసంస్కృతి అని దానితో బంగారు భవిష్యత్ ఉన్న విద్యార్థుల జీవితాలు బుగ్గిపాలు అవుతాయని గోదావరిఖని అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు అన్నారు. శనివారం గోదావరిఖని రమేష్‌నగర్‌లోని ఉషోదయ ఉన్నత పాఠశాలలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఆయన మాట్లాడుతూ లంచాలు, వరకట్నం, ర్యాగింగ్ వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా ర్యాగింగ్‌కు పాల్పడిన వారు జైలు శిక్షతో పాటు ఎలాంటి విద్యా సంస్థలలో భవిష్యత్‌లో సీటు పొందలేన్నారు. కష్టపడి చదివి మంచిస్థాయికి ఎదగాలని, తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కొత్త శ్రీనివాస్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు మేడ చక్రపాణి, సీనియర్ న్యాయవాదులు గుర్రం నారాయణ, బాస అనురాధ, లోక్ అధాలత్ సోషల్ వర్కర్ శంకర్, లీగల్ వాలంటీర్ సుజాత పాల్గొన్నారు.

ఆదర్శ కళాశాలలో వీడ్కోలు హంగామా



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ధర్మారం, ఫిబ్రవరి 17: ధర్మారం ఆదర్శ కళాశాలలో శనివారం పదో తరగతి, ఇంటర్ సెకండియర్ విద్యార్థులకు వీడ్కోలు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాలలో విద్యార్థులు నృత్య ప్రదర్శనలు చేశారు. జానపద గేయాలు, దేశభక్తి గీతాలు ఆలపించారు. పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించాలని కళాశాల ప్రిన్సిపాల్ దీనాకుమారి సూచించారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఆందోళన చెందకుండా పరీక్షలు రాయాలని ఆమె కోరారు. వీడ్కోలు వేడుకల కార్యక్రమంలో అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యోగం తిరిగి ఇవ్వాలని మాజీ హోంగార్డు ధర్నా



పద్మతో మాట్లాడుతున్న పోలీసులు

కోల్‌సిటీ, ఫిబ్రవరి 17: తనను కుట్రపూరితంగా ఉద్యోగం నుంచి తొలగించారని, తనకు ఉద్యోగం తిరిగి ఇవ్వాలంటూ గోదావరిఖనికి చెందిన మాజీ హోంగార్డు పద్మ శనివారం స్థానిక మెయిన్ చౌరస్తాలోని గాంధీ విగ్రహం ముందు ధర్నాకు దిగింది. తనను భర్త వదిలేశాడని, ఒంటరి మహిళనైన తనకు ఒక పోలీస్ అధికారి చొరవతో వేములవాడ దేవస్థానంలో హోంగార్డు ఉద్యోగం ఇచ్చారన్నారు. ఒక హోంగార్డు ఆందోళనలో ఆత్మహత్యయత్నం చేసుకుంటే తాను మాట్లాడినందుకు తనపై కక్షకట్టి కేసులు పెట్టారని, ఉద్యోగం నుంచి తొలగించారని వాపోయింది. తనను ఉద్యోగం ఇవ్వాలని అధికారులను కోరింది. రాత్రి వరకు ఆమె ఆందోళన నిర్వహించింది.

‘కాళేశ్వరం’తో జిల్లాకు ఒరిగిందేమీ లేదు

- లక్ష కోట్లు పెట్టి రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచారు
- అసెంబ్లీలో బీఆర్ఎస్‌పై ఎమ్మెల్యే విజయరమణారావు ఫైర్



మాట్లాడుతున్న విజయరమణారావు

పెద్దపల్లి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): 'ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని పట్టుకుని మాజీ సీఎం కేసీఆర్ బొందలగడ్డ మేడగడ్డకు ఏం పీకడానికి వెళ్లారని అంటారా.. మరి మీరున్నప్పుడు ఏం పీకడానికి వెళ్లారు.. కాళేశ్వరం ప్రాజెక్టును ఏటీఎంలా మార్చుకుని దోచుకున్నారు.. మీరు ఒక్కటి మాట్లాడితే, నాలుగు మాట్లాడతాం.. ఏలు పెడితే కాలు పెడతాం..' అంటూ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు మండిపడ్డారు. సాగునీటి ప్రాజెక్టులపై శనివారం అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేసిన సందర్భంగా జరిగిన చర్చలో ఎమ్మెల్యే విజయ రమణరావు మాట్లాడారు. కోటి ఎకరాలకు నీళ్లిస్తామని చెప్పి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా లక్ష ఎకరాలకు కూడా నీళ్లివ్వలేదని అన్నారు. కట్టిన మూడేళ్లకు మేడిగడ్డ కుంగిందని, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు బుంగలు పడ్డాయని విమర్శించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా రైతాంగానికి తీవ్ర అన్యాయం చేసి సిద్దిపేట, గజ్వేల్ ప్రాంతాలకు నీళ్లను తరలించుకు పోయారని అన్నారు. అప్పులు చేసి లక్ష కోట్లు ఖర్చు చేసిన కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా పెద్దపల్లి జిల్లాకు ఒక్క చుక్క నీరు కూడా రావడం లేదన్నారు. ఈ ప్రాంత రైతులకు మాయ మాటలు చెప్పి పొట్ట గొట్టిన బీఆర్ఎస్ పార్టీ ఓట్లు దండకున్నదన్నారు. గోదావరికి కాలు అడ్డం పెడితే నీళ్లు వస్తాయని, చేన్లన్నీ పాకురు పడతాయని, చేపలు కూడా పట్టుకోవచ్చని మాజీ సీఎం కేసీఆర్ చెప్పారని, కానీ ఒక్క చుక్క నీరు కూడా రాలేదన్నారు. మంథని, రామగుండం, పెద్దపల్లి నియోజకవర్గాలకు నీళ్లు రావడం లేదని, చిన్న కాళేశ్వరం ప్రాజెక్టును నిర్లక్ష్యం చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ద్వారానే ఈ ప్రాంతానికి నీళ్లు వస్తున్నాయన్నారు. కానీ ఎస్సారెస్పీ చివరి ఆయకట్టుకు నీళ్లిచ్చామని మాజీ మంత్రి హరీష్‌రావు చెప్పడం సరైంది కాదన్నారు. ఇప్పుడే మీరు వస్తే నిరూపిస్తామన్నారు. కేసీఆర్‌ను ఆయన కుటుంబాన్ని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజలు బతికిస్తే నిండా ముంచారని మండిపడ్డారు. ఉమ్మడి కరీంనగర్, తెలగాణ గురించి మాట్లాడే హక్కు బీఆర్ఎస్‌కు లేదన్నారు. పెద్దపల్లి జిల్లాలో సుమారు రెండు లక్షల ఎకరాల భూములకు ఎస్సారెస్పీ నీళ్లే వస్తున్నాయన్నారు. నందిమేడారం రిజర్వాయర్ కింద కూడా ఒక్క ఎకరానికి అదనంగా నీరివ్వలేదని, పెద్దపల్లి జిల్లా రైతులకు చివరి ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని విజయరమణారావు అన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



పిల్లలతో పాఠ్యపుస్తకాల్లోని అంశాలను చదివిస్తున్న కలెక్టర్

సుల్తానాబాద్, ఫిబ్రవరి 17: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించి విద్యాబోధన అందిస్తున్నామని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను శనివారం సందర్శించి, అక్కడ నిర్వహిస్తున్న పేరెంట్, టీచర్స్ మీటింగ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరుకునే విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో బోధనలు చేస్తున్నామన్నారు. ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ నాణ్యతో కూడిన విద్య అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని, నిపుణులైన ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్నారని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో తొలిమెట్టు, ఉన్నతి కార్యక్రమాల ద్వారా ప్రతీ విద్యార్థికి పాఠ్యాంశాలు అర్థమయ్యేలా ఉన్నతమైన విధానాల ద్వారా బోధనలు చేస్తున్నామని, మెరుగైన ఫలితాల సాధన దిశగా కృషి చేస్తున్నామన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి నెల తల్లిదండ్రుల టీచర్స్ సమావేశాలు నిర్వహిస్తున్నామని తల్లిదండ్రులు ఇందులో తమ సూచనలు అందించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కలెక్టర్ సూచించారు. కాగా తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించగా కలెక్టర్ విజేతలకు నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల మానిటరింగ్ ఆఫీసర్ పీఎం షేక్, ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, ఎంపీవో ఫయాజ్ అలీ, హెచ్ఎం తుళ సుధాకర్‌రావు, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, శ్రీధర్, రవిప్రసాద్, అలేఖ్య రాణి, కవిత పాల్గొన్నారు.

మార్చి 15 నాటికి వృద్ధాశ్రమం పనులు పూర్తిచేయాలి

జిల్లాలోని వృద్ధులకు ఆశ్రయం కల్పించేందుకు చేపట్టిన వృద్ధాశ్రమం నిర్మాణ పనులు మార్చి 15 నాటికి పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. సుల్తానాబాద్ పట్టణంలో నిర్మిస్తున్న వృద్ధాశ్రమం పనులను ఆయన శనివారం పరిశీలించారు. రూ. 70 లక్షలతో చేపట్టిన ఈ వృద్ధాశ్రమ పనులు పురోగతి గురించి పంచాయతీరాజ్ డీఈ దేవేందర్, జిల్లా సంక్షేమాధికారి రౌఫ్ ఖాన్, సీడీపీవో కవిత తదితరులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వృద్ధాశ్రమంలో టైల్స్ వేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, జారని రాళ్లతో ఫ్లోరింగ్ పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. వృద్ధాశ్రమంలో పెండింగ్‌లో ఉన్న పనులు మార్చి 15 నాటికి పూర్తి చేయాలి అన్నారు. కాగా ఒకే ప్రాంగణంలో వృద్ధాశ్రమం, వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్, ఇతర సంక్షేమ భవనాలు వచ్చే విధంగా తగు ప్రణాళికలు తయారు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. వృద్ధాశ్రమ ప్రాంగణంలో ప్రహరీ నిర్మాణం చేసేందుకు 30 లక్షల రూపాయలు ఖర్చు ఉంటుందని అధికారులు వివరించగా అవసరమైన నిధులు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఆయన వెంట అధికారులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి



అజయ్(ఫైల్)

సుల్తానాబాద్, ఫిబ్రవరి 17: మండలంలోని సుద్దాల పెట్రోల్ బంక్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కనుకుల గ్రామానికి చెందిన బొంగోని అజయ్(19) మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అజయ్ ద్విచక్రవాహనంపై సుల్తానాబాద్ వస్తున్నాడు. సుల్తానాబాద్ నుంచి కాల్వశ్రీరాంపూర్ వైపు వెలుతున్న ఓ వ్యాన్ ఎదురుగా ఢీకొట్టింది. ఈ సంఘటనలో బైక్ నడుపుతున్న అజయ్ తీవ్రంగా గాయపడగా అతన్ని ఆసుపత్రికి తరలి స్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. అజయ్ పదో తరగతి పూర్తి చేసి ఐటీఐ శిక్షణ పొందుతున్నాడు. మృతుడి తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వీఏసీసీ రాష్ట్ర అధ్యక్షుడిగా మురళీధర్

కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 17: విజిలెన్స్ అండ్ యాంటీ కరప్షన్ కౌన్సిల్(వీఏసీసీ) రాష్ట్ర అధ్యక్షుడిగా గోదావరిఖనికి చెందిన సీనియర్ న్యాయవాది వేల్పుల మురళీధర్ యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ రాజలింగు మోతె ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సిల్ బలోపేతానికి నిబద్ధతతో పనిచేయాలని, అవినీతిని, సాంఘిక దురాచారాలను నిర్మూలించడమే లక్ష్యంగా పనిచేయాలని రాజలింగు సూచించారు. తనపై నమ్మకంతో ఎన్నుకున్నందుకు అవినీతి, సాంఘిక దురాచారాలను నిర్మూలించేందుకు, నేరాల నియంత్రణకు కృషి చేస్తానని మురళీధర్ యాదవ్ తెలిపారు. మురళీధర్‌యాదవ్‌కు న్యాయవాదులు, పలు స్వచ్ఛంధసంస్థ ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

రామగుండం రైతులను విస్మరించిన బీఆర్ఎస్ ప్రభుత్వం

- అసెంబ్లీలో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్



మాట్లాడుతున్న మక్కాన్‌సింగ్

గోదావరిఖని, ఫిబ్రవరి 17: రాష్ట్రం సస్యశ్యామలంగా ఉండాలని హైదరాబాద్‌కు తాగునీరు ఇవ్వాలని రామగుండం ప్రజలు త్యాగాలు చేశారని, తమ ఊర్లను, పంట పొలాలను తక్కువ ధరలకు ఇచ్చారని, అలాంటి రైతులను గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని రామగుండం శాసనసభ్యుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. శనివారం సాగునీటి ప్రాజెక్టులపై శ్వేతపత్రం విడుదల చేసిన సందర్భంగా జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. సమైక్య ఆంధ్రాలో హైదరాబాద్‌కు తాగునీరు, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు సాగునీరు అందించేందుకు గోదావరిపై ఎల్లంపల్లి వద్ద ప్రాజెక్టు నిర్మించారన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయిన తరువాత తెలంగాణ ఉద్యమం వచ్చి రాష్ట్రం సిద్ధించిందన్నారు. ప్రాజెక్టు పక్కనే ఉన్న అంతర్గాం, పాలకుర్తి మండలాల రైతాంగానికి సాగునీరు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ ఉద్యమాలు చేసిందన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క, ఉత్తమకుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, జీవన్‌రెడ్డి వంటి ఎందరో నేతలు ఈ ఆందోళనలో పాల్గొన్నారన్నారు. ఆ రోజుల్లో ముఖ్యమంత్రిని కలువడం సాధ్యంకాలేదని, హరీష్‌రావును కలిసి విజ్ఞప్తులు చేశామన్నారు. ప్రజల డిమాండ్‌తో ముఖ్యమంత్రి లిఫ్ట్ ప్రకటించి ఎనిమిది ఏళ్లకు కూడా పూర్తి కాలేదన్నారు. 35ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే ఎల్లంపల్లి-మద్దిర్యాల, బండలవాగు లిఫ్ట్, రామగుం డం లిఫ్ట్ చేయాల్సి ఉందన్నారు. ఒక లిఫ్ట్‌కు మరో ఆరు కోట్ల రూపాయలు ఇస్తే పూర్తవుతుందన్నారు. రామగుండం, లింగాపూర్ లిఫ్ట్, పాలకుర్తి లిఫ్ట్ ఇంకా డీపీఆర్‌లే పూర్తి కాలేదన్నారు. తమ చుట్టూ గోదావరి ఉందని, అందులో నీరు తమ ప్రాంతానికి ఉపయోగపడకపోగా దూకి చావడానికి పనికి వస్తుందని ఆవేదన చెందారు.

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తమ ప్రాంతంలో ఎక్కడ సమావేశాలు పెట్టినా ముర్మూర్ గ్రామానికి చెందిన కవి సదాశివుడి పాట తలాపున పారుతున్న గోదావరి పాట గుర్తు చేశారే తప్ప ఆ ప్రాంతానికి న్యాయం చేయలేదన్నారు. కవులను కూడా వా డుకుని అవమాన పరిచారన్నారు. వెంటనే ఆరు కోట్ల రూపాయలు విడుదల చేసి తమ ప్రాంతానికి సాగునీరు అందించాలని ఆయన కోరారు.

అత్తింటి ఎదుట తోడికోడళ్ల బైఠాయింపు

మానకొండూర్, ఫిబ్రవరి 17: మండలంలోని గంగిపల్లిలో ప్రేమించి, పెళ్లి చేసుకుని మోసం చేశాడని ఆరోపిస్తూ అత్తింటి ఎదుట శనివారం బైఠాయించారు. బాధిత మహిళలు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గంగిపల్లి గ్రామానికి చెందిన గొడిశాల రమేశ్, గొడిశాల వెంకటేశ్ ఇద్దరు అన్నదమ్ములు. రమేశ్ అదే గ్రామానికి చెందిన చంద్రకళ అనే యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. కొంత కాలం తరువాత చంద్రకళ మరో చోట ఉంటోంది. ఈ నేపథ్యంలో రమేశ్ మరో యువతిని పెళ్లి చేసుకుని ఊర్లోనే కాపురం పెట్టాడారు. అతని తమ్ముడు గొడిశాల వెంకటేశ్ హైదరాబాద్‌లో ఓ ప్రయివేట్ కంపెనీలో ఉద్యోగం చేసేవాడు. ఆ సమయంలో హైదరాబాద్‌లో స్థిరపడిన కర్ణాటకకు చెందిన రాధికతో పరిచయం ఏర్పడింది. రాధికకు ముందే పెళ్లి అయి ఒక కుమారుడు ఉన్నాడు. కాగా రాధికకు భర్త చనిపోయాడు. రాధికకు, వెంకటేశ్‌కు ఏర్పడిన పరిచయం పెళ్లికి దారి తీసింది. కొంత కాలం రాధికతో ఉన్న వెంకటేశ్ గంగిపల్లికి వచ్చి మరో యువతిని పెళ్లి చేసుకుని ఇక్కడే ఉంటున్నాడు. వెంకటేశ్ తన దగ్గరికి రాకపోవడంతో రాధిక అతడి విషయంపై ఆరా తీయగా మరో పెళ్లి చేసుకున్న విషయం తెలిసింది. దీంతో శనివారం ఆమె గ్రామానికి చేరుకుని తనకు న్యాయం చేయాలని వెంకటేశ్ ఇంటి ఎదుట బైఠాయించింది. విషయం తెలుసుకున్న రమేశ్ మొదటి భార్య చంద్రకళ సైతం రాధికతో పాటు బైఠాయించింది. చంద్రకళ ఇంటిముందు బైఠాయించిందన్న విషయం తెలుసుకున్న రమేశ్ ఆమెకు ఫోను చేయడంతో చంద్రకళ వెళ్లిపోయింది. ఇంటిముందు రాధిక ఒక్కతే ఉండడంతో వెంకటేశ్‌తో పాటు అతని కుటుంబ సభ్యులు దాడి చేసి గాయపరిచినట్లు బాధితురాలు వాపోయింది. సమాచారం తెలుసుకున్న ఎస్సై శ్రీకాంత్ సంఘటనా స్థలానికి చేరుకొని వెంకటేశ్ కుటుంబసభ్యులను స్టేషన్‌కు పిలిపించి న్యాయం చేస్తామని చెప్పి రాధికను తీసుకెళ్లారు. రాధిక ఫిర్యాదు మేరకు వెంకటేశ్‌తో పాటు అతడి అన్న, తల్లిదండ్రులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మల్యాల, ఫిబ్రవరి 17: కరీంనగర్-జగిత్యాల మార్గంలోని కొండగట్టు మారుతీ టౌన్‌షిప్ వద్ద శనివారం కారు-బైక్ ఢీ కొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. టౌన్ షిప్ సమీపంలో జగిత్యాల వైపు నుంచి స్విఫ్ట్ కారుతో పాటు కొడిమ్యాల మండలం అప్పారావుపేటకు చెంది న గరిగంటి శ్రీనివాస్(40) అనే వ్యక్తి ద్విచక్రవాహనం ప్రమాదవశత్తూ ఢీకొన్నాయి. దీంతో అతను కింద పడగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన శ్రీనివాస్‌ను 108లో జగిత్యాల ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో మృతి చెందాడు. శ్రీనివాస్ కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రహీం తెలిపారు.

ఇసుక తరలిస్తున్న టిప్పర్ పట్టివేత

కథలాపూర్, ఫిబ్రవరి 17: మండలంలోని గంభీర్‌పూర్ శివారులోని వాగులో నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ పట్టుకున్నామని ఎస్సై నవీన్ తెలిపారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు తమ సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నామన్నారు. కేసు నమోదు చేశామని తెలిపారు. వాగుల్లోంచి అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

రేవంత్.. సంకుచిత వ్యాఖ్యలు మానుకోవాలి

» బీసీల గురించి రాహుల్ మాట్లాడడం విడ్డూరం: కవిత



హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఏర్పాటు తర్వాత చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే(ఎస్‌కేఎస్) వివరాలు ఒకే కుటుంబ దగ్గర ఉన్నాయంటూ సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడడం తగదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఇకనైనా సంకుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని సూచించారు. 2011లో యూపీఏ ప్రభుత్వం రూ.4,500 కోట్ల ఖర్చుతో దేశవ్యాప్తంగా కులగణన చేసినా, నివేదిక మాత్రం బయటపెట్టలేదని దుయ్యబట్టారు. ఆ వివరాలను గాంధీ కుటుంబం దాచిపెట్టుకుందా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఇప్పుడు బీసీల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో శనివారం ఆమె మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి బీసీల వ్యతిరేక అని, గతంలో పార్లమెంట్‌లో రాజీవ్‌గాంధీ బీసీల వ్యతిరేకంగా మాట్లాడారని ఆరోపించారు. తాతా తోటా లేకుండా ప్రవేశపెట్టిన తీర్మానంతో కులగణన ఎలా చేస్తారని నిలదీశారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీతో బీఆర్ఎస్ పొత్తు ఉంటుందన్న ఊహాగానాల్లో అడిగిన ప్రశ్నకు కవిత ఆచితూచి స్పందించారు. పొత్తు అంశం గురించి చెప్పేంత స్థాయి తనది కాదని పేర్కొన్నారు.

రవాణా శాఖలో భారీగా బదిలీలు

» ఏడుగురు డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్లు, 23 మంది ఆర్టీఓలు, 150 మంది ఎంవీఐల బదిలీ

రవాణా శాఖలో ఎక్కువ కాలం నుంచి ఒకే ప్రాంతంలో పనిచేస్తున్న పలువురు రవాణాశాఖ అధికారులను(ఆర్టీఓ), ఎంవీఐలను బదిలీ చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. రాజకీయ పైరవీలతో పని చేయాల్సిన కేంద్రానికి బదులుగా లాబీదయాన్ని చెక్‌పోస్టుల్లో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు, సహాయ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ల డిప్యూటేషన్‌లను గతవారం ప్రభుత్వం రద్దు చేసింది. తాజాగా రవాణా శాఖలో పూర్తి స్థాయిలో ప్రభుత్వం బదిలీలతో ప్రక్షాళన ప్రారంభించింది. మొట్టమొదటి సారిగా ప్రతీ అధికారి బదిలీ కోసం ప్రత్యేక జీవోను విడుదల చేసింది. ఏడుగురు డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్లు, 23 మంది ఆర్టీఓలు, 150 మంది ఎంవీఐలను బదిలీ చేసింది.

గొర్రెల కొనుగోళ్ల బిల్లుల చెల్లింపులో మోసం!

» దర్యాప్తులో దూకుడు పెంచిన ఏసీబీ

» ఏపీ రైతుల స్టేట్‌మెంట్ రికార్డు

ఆంధ్రప్రదేశ్ రైతుల నుంచి గొర్రెల యూనిట్లు కొనుగోలు చేసి వారికి బిల్లులు చెల్లించకుండా దారి మళ్లించిన కేసు దర్యాప్తులో ఏసీబీ దూకుడు పెంచింది. ఎనిమిది మంది రైతులను శనివారం విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేసింది. ఏపీకి చెందిన 18 మంది రైతుల నుంచి కొనుగోలు చేసిన 133 యూనిట్ల గొర్రెలకు సంబంధించిన రూ.2.8 కోట్ల బిల్లులివ్వాల్సి ఉంది. అయితే ఎంతకీ తమ బిల్లు చెల్లింపుకాకపోవడంతో రైతులు పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో ఆరా తీయగా బిల్లులు మంజూరైనట్టు తెలిసింది. తమ పేరుతో వేరొకరు బిల్లులు తీసుకున్నట్లు తెలియడంతో తాము మోసపోయినట్లు గుర్తించిన బాధితులు గత డిసెంబరులో సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ వద్ద కొన్న గొర్రెల యూనిట్లకు డబ్బులు చెల్లించలేదని కాంట్రాక్టర్‌తోపాటు పశుసంవర్ధక శాఖ అధికారులపై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఈ కేసు ఆధారంగా ఎఫ్ఐఆర్ కోణంలో ఏసీబీ అధికారులు విచారణ చేపట్టారు. 8 మంది ఏపీ రైతులను విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. కాంట్రాక్టర్ మొహినుద్దీన్, పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు రవి కుమార్, ఆదిత్య, కేశవసాయిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

కాంగ్రెస్ గూటికి భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం?



ఖమ్మం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం బీఆర్ఎస్ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు త్వరలోనే కాంగ్రెస్‌లో చేరబోతున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు హైదరాబాద్‌లో చర్చలు జరిగినట్లు కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పది అసెంబ్లీ నియోజకవర్గాలుండగా.. భద్రాచలంలో మాత్రమే బీఆర్ఎస్ విజయం సాధించింది. గతంలో బీఆర్ఎస్‌లోనే ఉన్న తెల్లం వెంకట్రావు అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రస్తుత రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. అయితే భద్రాచలంలో కాంగ్రెస్ నుంచి అప్పటికే సిటింగ్ ఎమ్మెల్యేగా పొదెం వీరయ్య ఉండడంతో తెల్లంకు టికెట్ విషయంలో ఇబ్బందులు ఎదురయ్యాయి. అదే సమయంలో బీఆర్ఎస్ నుంచి టికెట్ ఆఫర్ రావడంతో వెంకట్రావు మళ్లీ బీఆర్ఎస్ గూటికి చేరారు. జిల్లాకు చెందిన మంత్రి పొంగులేటి అనుచరుడిగా ఉన్న వెంకట్రావు అసెంబ్లీ ఎన్నికల తర్వాత వెంటనే కాంగ్రెస్‌లో చేరతారని ప్రచారం జరిగింది. ఆయన కొట్టిపారేశారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గ అభివృద్ధికి రూ.10కోట్లు నిధులు కేటాయించింది. ఆ నిధుల వినియోగంపై జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రులకు అధికారం కల్పించింది. దీనికితోడు త్వరలో మార్కెట్ కమిటీలతో పాటు పలు నియామక కమిటీలకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టబోతోంది. ఈ నేపథ్యంలోనే తెల్లం కాంగ్రెస్ గూటికి చేరేందుకు ఆసక్తి చూపుతున్నట్లు తెలిసింది. జిల్లా మంత్రి పొంగులేటితో పాటు మరో రాష్ట్ర మంత్రితో మంతనాలు సాగించి పార్టీలో చేరేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. లోక్‌సభ ఎన్నికలకు ముందే వెంకట్రావు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకునే అవకాశం ఉందని సమాచారం. అయితే తెల్లం వర్గీయులు మాత్రం తమ ఎమ్మెల్యే బీఆర్ఎస్‌లోనే ఉంటారని, కాంగ్రెస్‌లో చేరే అవకాశం లేదని చెబుతున్నారు.

సీపీఆర్ చేసి వ్యక్తి ప్రాణాలు కాపాడిన ఎస్సై

వీడియో వైరల్ కావడంతో ప్రశంసల వెల్లువ



బాధితుడికి సీపీఆర్ చేస్తున్న ఎస్సై మైబెల్లి

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : కుటుంబ సమస్యలతో వేదనకు గురైన ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. సమాచారం అందుకున్న ఎస్సై హుటాహుటిన అక్కడికి చేరుకుని బాధితుడికి సీపీఆర్ చేయడంతో అతని ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. బెంగాల్‌కు చెందిన సంతోష్ ముఖర్జీ(38) ఇబ్రహీంపట్నంలోని బీఈఎల్ కన్‌స్ట్రక్షన్ సంస్థలో కూలి పని చేస్తున్నాడు. కుటుంబ సమస్యలతో మానసిక వేదనకు గురైన సంతోష్, శనివారం ఉన్నట్టుండి తాను పనిచేసే సంస్థ సమీపంలో ఉన్న అటవీ ప్రాంతం వైపు వెళ్లాడు. గమనించిన తోటి కూలీలు పోలీసు వాహనంలో అటుగా వచ్చిన ఎస్సై మైబెల్లికి సమాచారమిచ్చారు. వెంటనే స్పందించిన ఎస్సై చుట్టుపక్కల వెతకగా.. సంతోష్ చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. కిందకి దించి చూసి శ్వాస ఆడటం లేదని తెలిసి సీపీఆర్ చేశారు. కొద్దిసేపటికి బాధితుడు స్పృహలోకి రావడంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతను కోలుకుంటున్నాడు. కాగా, బాధితుడికి ఎస్సై మైబెల్లి సీపీఆర్ చేస్తున్న వీడియో వైరల్ కావడంతో ఆయన చేసిన పనికి సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

పాల్గొన్న ముఖ్య నేతలు, బీఆర్ఎస్ శ్రేణులు.. ఆటో డ్రైవర్లకు ప్రమాదబీమా పత్రాలు అందజేసిన కేటీఆర్

» 'అతనే ఒక చరిత్ర' పేరిట కేసీఆర్‌పై డాక్యుమెంటరీ ప్రదర్శన

» కేసీఆర్‌కు గవర్నర్, సీఎం రేవంత్, హరీశ్, కేటీఆర్, కవిత శుభాకాంక్షలు

హైదరాబాద్/జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ 70వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో 70 కిలోల కేక్‌ను కట్‌చేశారు. అంతకుముందు బీఆర్ఎస్ నేతలతో కలిసి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ తల్లి విగ్రహానికి, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన చేతుల మీదుగా పలువురు ఆటో డ్రైవర్లకు రూ.1లక్ష కవరేజీతో కూడిన ప్రమాదబీమా పత్రాలను అందజేశారు. అదేవిధంగా దివ్యాంగులకు వీల్ చైర్లు పంపిణీ చేశారు. రాజకీయం, తెలంగాణ ఉద్యమ నేపథ్యం, కేసీఆర్ జీవితంలోని ముఖ్యమైన సంఘటనలపై 'అతనే ఒక చరిత్ర' పేరిట సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జ్ తలసాని సాయికిరణ్ యాదవ్ ఆధ్వర్యంలో రూపొందించిన డాక్యుమెంటరీని ప్రదర్శించారు. కేసీఆర్ ఆమరణ దీక్ష విశేషాలను వివరించేలా ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం ప్రమాదవశాత్తు మరణించిన 70 మంది బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు ప్రమాద బీమా కింద ఒక్కొక్కరికి రూ.2లక్షల చొప్పున మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను మాజీ మంత్రులు తలసాని, మహమూద్ అలీ అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీలు కె.కేశవరావు, బడుగుల లింగయ్య యాదవ్, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి, మాజీ మంత్రులు మహమూదలీ, తలసాని, నిరంజన్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, శ్రీనివా్‌స్ గౌడ్, పలువురు పార్టీ ముఖ్య నేతలు పాల్గొన్నారు. కాగా, కేసీఆర్‌కు రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆమె శుభాకాంక్షలు తెలుపుతూ రాసిన లేఖను, పుష్ప గుచ్ఛాన్ని గవర్నర్ కార్యాలయ ప్రతినిధి ఒకరు తెలంగాణ భవన్‌లో అందజేశారు. కేసీఆర్‌కు మాజీ మంత్రి హరీశ్‌రావు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ స్వాప్నికుడు, స్వరాష్ట్ర సాధకుడు అని ట్విటర్ వేదికగా కొనియాడారు. కేసీఆర్‌కు జనసేన అధినేత పవన్ కల్యాణ్ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పోరాట పటిమతో అంచలంచెలుగా ఎదిగిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు.



ఆటో డ్రైవర్లకు చెక్కులు అందజేస్తున్న కేటీఆర్

కేసీఆర్ ప్రతిపక్ష నేత పాత్రను సమర్థంగా పోషించాలి: రేవంత్

అసెంబ్లీ వేదికగా మాజీ సీఎం కేసీఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. '40 ఏళ్ల కేంద్ర, రాష్ట్ర రాజకీయాల్లో తనదంటూ పాత్ర పోషించిన కేసీఆర్, తెలంగాణ పునర్నిర్మాణంలో ప్రతిపక్ష నాయకుడి పాత్రను సమర్థంగా పోషించాలి. భగవంతుడు ఆయనకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలి' సీఎం రేవంత్ ఆకాంక్షించారు.

ఎర్రవల్లిలో ఆయుష్య హోమం

కేసీఆర్ 70వ జన్మదినం సందర్భంగా శనివారం ఆయన దత్తత గ్రామమైన సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లిలో మాజీ సర్పంచ్ భాగ్యబాల్‌రాజు ఆధ్వర్యంలో ఆయుష్య హోమం నిర్వహించారు. ఉదయం రంగనాయకస్వామి ఆలయంలో కేసీఆర్ పేరున అర్చన, ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రామిసిక వైద్య ఆరోగ్య కేంద్రంలో పండ్లు పంపిణీ చేశారు. మరోవైపు, కేసీఆర్ తన జన్మదిన వేడుకలను ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో నిరాడంబరంగా జరుపుకొన్నారు. శనివారం ఉదయం మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి వ్యవసాయ క్షేత్రానికి వచ్చి కేసీఆర్‌ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డిపై అవిశ్వాసం

» కాంగ్రెస్‌లో చేరిన మరుసటి రోజే బీఆర్ఎస్ ప్రతిపాదన

» వికారాబాద్ అదనపు కలెక్టర్‌కు తీర్మాన ప్రతి అందజేత

వికారాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతామహేందర్‌రెడ్డిపై బీఆర్ఎస్ జడ్పీటీసీ సభ్యులు అవిశ్వాసం ప్రకటించారు. మొత్తం 12 మంది జడ్పీటీసీలు చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ సంతకాలు చేసిన తీర్మాన పత్రాన్ని శనివారం జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌కు అందజేశారు. కాంగ్రెస్‌లో చేరిన మరుసటి రోజే వ్యూహాత్మకంగా వికారాబాద్, తాండూరు మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, రోహిత్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ జడ్పీటీసీలు సునీతపై అవిశ్వాసం ప్రకటించారు. ఈ తీర్మానంపై బీఆర్ఎస్ జడ్పీటీసీలు జడ్పీ వైస్ చైర్మన్ బైండ్ల విజయకుమార్(మోమిన్‌పేట), కె.నాగిరెడ్డి(దోమ), కె.మహిపాల్(దౌల్తాబాద్), ఎం.మేఘమాల(పూడూరు), కె.సుజాత (ధారూరు), కె.జయమ్మ(నవాబుపేట), నాగారంకోల(కోట్‌పల్లి), హరిప్రియ(పరిగి), మంజుల(తాండూరు), ప్రమోదిని(వికారాబాద్), వి.మధుకర్(మర్పల్లి), కె.రాందాస్(బంట్వారం) సంతకాలు చేశారు. అవిశ్వాస తీర్మానం అందజేసిన 15 రోజుల్లో అధికారులు నోటీసులు జారీ చేయాల్సి ఉంటుంది. అయితే, ఈ అంశంలో అధికారులు ఏ విధంగా వ్యవహరించనున్నారన్నది దానిపై ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుతం వికారాబాద్ జిల్లా పరిషత్‌లో బీఆర్ఎ్‌సకు 14మంది సభ్యులు ఉండగా, కాంగ్రెస్‌కు నలుగురు సభ్యులు ఉన్నారు. కాంగ్రెస్‌లో చేరిన సునీతా మహేందర్‌రెడ్డి జెడ్పీ చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేయాలని జడ్పీ వైస్ చైర్‌పర్సన్ బైండ్ల విజయకుమార్ డిమాండ్ చేశారు. రాజీనామా చేయకుంటే ఆమె పార్టీ మారడాన్ని ఖండిస్తూ అవిశ్వాసం ప్రకటించామన్నారు. ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి సైతం తన పదవికి రాజీనామా చేసిన తర్వాతే కాంగ్రెస్‌లో చేరాలని సూచించారు. బీఆర్ఎస్‌లో చేరినప్పుడు ఏమి ఆశించి వచ్చారో.. అదే ఆశించి మళ్లీ కాంగ్రెస్‌లోకి వెళ్లారని విమర్శించారు. పట్నం దంపతులకు పదవీ వ్యామోహం తప్ప, ప్రజలపై ప్రేమ లేదని దుయ్యబట్టారు.

యాదాద్రి ఆలయంలో బ్రేక్ దర్శనం అమలు తీరుపై పరిశీలన

వేములవాడ, ఫిబ్రవరి 17: ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి దేవస్థానంలో వీవీఐపీ బ్రేక్ దర్శనం అమలు సాధ్యాసాధ్యాలపై అధికారులు యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో క్షేత్ర స్థాయి పరిశీలన జరిపారు. తిరుమల, యాదాద్రి ఆలయాల తరహాలో రాజరాజేశ్వర స్వామివారి దేవస్థానం లోనూ బ్రేక్ దర్శనం సౌకర్యం కల్పించేందుకు అవసర చర్యలు తీసుకోవాలని స్థానిక శాసనసభ్యుడు, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆలయ అధికారులకు సూచించారు. ఈ మేరకు రాజన్న ఆలయ ఏఈవో బి.శ్రీనివాస్, ప్రొటోకాల్ పర్యవేక్షకులు శ్రీరాములు, నాగుల మహేష్, ఇంజనీరింగ్ అధికారి నాగ రాజు శనివారం యాదాద్రి వెళ్లి అక్కడ వీవీఐపీ బ్రేక్ దర్శనాల విధి విధానాలను ప రిశీలించారు. ఈ సందర్భంగా యాదాద్రి ఆలయ ప్రొటో కాల్ అధికారులు ఏఈవో రామ్మోహన్, పర్యవేక్షకుడు రాజన్‌బాబు వీవీఐపీ బ్రేక్ దర్శనం కోసం తీసుకుంటున్న చర్యలు, అమలుతీరును వివరించారు. ఉదయం 9 నుంచి 10 వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు 1500 మంది చొప్పున రోజుకు మొత్తం మూడు వేల మందికి వీవీఐపీ బ్రేక్ దర్శన సౌకర్యం కల్పిస్తున్నామని, వీవీఐపీ బ్రేక్ దర్శనం టికెట్ రుసుము కింద 300 రూపాయల వసూలు చేస్తున్నట్లు వివరించారు.



యాదాద్రి ఆలయ అధికారులతో చర్చిస్తున్న సిబ్బంది

కొండగట్టులో భక్తుల సందడి

మల్యాల, ఫిబ్రవరి 17: కొండగట్టు అంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో కిటకిటలాడింది. వేలాదిగా భక్తులు వేకువజాము నుంచే స్వామి వారి దర్శనానికి బారులు తీరారు. భక్తులతో క్యూలైన్లు నిండిపోయాయి. భక్తులు ఆలయంలో అంజన్నను దర్శించుకున్న అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారికి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రద్దీ రీత్యా నిరంతరంగా కొనసాగింది. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు, పోలీసులు పర్యవేక్షించారు.



క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

రవాణా శాఖలో అధికారుల బదిలీలు

తిమ్మాపూర్, ఫిబ్రవరి 17: తెలంగాణ ప్రభుత్వం రవాణా శాఖలో భారీగా బదిలీలను చేపట్టింది. డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ల(డీటీసీ) నుంచి రీజనల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్లు(ఆర్టీవో), మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు(ఎంవీఐ), అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ల(ఏఎంవీఐ)ల వరకు బదిలీ అయ్యారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బదిలీలు ఇలా ఉన్నాయి. ఈ బదిలీ ల్లో భాగంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు సంబంధించిన డీటీసీగా ఉన్న మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్‌ను రంగారెడ్డి జిల్లాకు బదిలీ చేశారు. వరంగల్ డీటీసీ పి పురుషోత్తం ఉమ్మడి కరీంనగర్ జిల్లా డీటీసీగా బదిలీ అయ్యారు.

● కరీంనగర్ జిల్లా రవాణా కార్యాలయం నుంచి బదిలీఅయిన వారిలో ఆర్‌నాగలక్ష్మి(ఎంవీఐ) కామారెడ్డి కి, ఎం.శ్రీనివాస్(ఎంవీఐ)జగిత్యాల జిల్లా కోరుట్లకు, రాకేర్ ఈశ్వర్‌సింగ్(ఎంవీఐ) నిర్మల్‌కు, బి.రజనీదేవి (ఏఎంవీఐ) రాజన్న సిరిసిల్లకు బదిలీ అయ్యారు. కాగా టి రవికుమార్(ఎంవీఐ) ఆదిలాబాద్, కె.వేణు(ఎంవీఐ) హనుమకొండ, బి.శ్రీకాంత్ చక్రవర్తి(ఎంవీఐ) కుమరం ఆసిఫాబాద్, ప్రవంతి(ఏఎంవీఐ) హనుమకొండ నుంచి కరీంనగర్ జిల్లాకు బదిలీపై వచ్చారు.

● రాజన్న సిరిసిల్ల జిల్లా రవాణా శాఖ కార్యాలయం నుంచి వై కొండల్‌రావు (ఆర్‌టీవో) హుస్నాబాద్‌కు, ఏ.కిషోర్ చంద్రారెడ్డి(ఎంవీఐ) మంచిర్యాల, టి విజయకుమార్(ఏఎంవీఐ)ఆదిలాబాద్‌కు బదిలీ అయ్యారు. వి లక్ష్మణ్(ఎంవీఐ)సిద్దిపేట జిల్లా శోభన్ బాబు(ఎంవీఐ) బోధన్ నుంచి రాజన్న సిరిసిల్ల జిల్లాకు వచ్చారు.

● జగిత్యాల జిల్లా నుంచి సీహెచ్ రంజిత్ కుమార్ (ఎంవీఐ) మంచిర్యాలకు, వెంకటరమణ(ఎంవీఐ) కొత్తగూడెంకు, షేక్ ఖాసీమ్ సాహెబ్(ఏఎంవీఐ) మంచిర్యాలకు బదిలీ అయ్యారు. శ్రీనివాస్(ఎంవీఐ)కోరుట్ల, వెంకన్న(ఎంవీఐ)మహబూబాబాద్, సీహెచ్ రామా రావు(ఏఎంవీఐ)ఆదిలాబాద్ నుంచి జగిత్యాలకు బదిలీ అయ్యారు.

● పెద్దపల్లి జిల్లా నుంచి అఫ్రిన్ సిద్దికి(ఎంవీఐ) ఖమ్మంకు, సిరాజ్ ఉర్ రహ్మాన్ (ఏఎంవీఐ), ములుగు జిల్లాకు, ఆలే శ్రీనివాస్ ఆదిలాబాద్‌కు బదిలీ అయ్యారు. ఉమార్ ఫారూఖ్(ఏఎంవీఐ) పాల్వాంచ చెక్ పోస్ట్ ఇబ్రాహిం కొత్త గూడెంకు బదిలీ కాగా పి రంగారావు (ఎంవీఐ) వరంగల్ నుంచి శివ స్వప్న(ఎంవీఐ) నిర్మల్ నుంచి, బి శ్రీనివాస్(ఏఎంవీఐ) భూపాలపల్లి జయశంకర్ నుంచి పెద్దపల్లి జిల్లాకు బదిలీ అయ్యారు.

హైనా దాడిలో లేగదూడ మృతి

చిగురుమామిడి, ఫిబ్రవరి 17: మండలంలోని నవాబుపేటలో మల్లి శ్రీనివాస్ అనే రైతు లేగదూడపై హైనా దాడి చేయడంతో తీవ్ర గాయాలై మృతి చెందింది. శ్రీనివాస్ పశువులను బావి వద్దనే కట్టి వేస్తాడు. శనివారం ఉదయం బావి వద్దకు వెళ్లి చూడగా లేగ దూడ మృతి చెంది ఉందని రైతు తెలిపాడు.



పెళ్లెప్పుడవుతుంది..

పిల్ల ఏడ దొరుకుతుంది

సండే స్పెషల్

వధువుల కోసం యువకులు, తల్లిదండ్రుల వేట

● అన్ని రకాలుగా స్థిరపడ్డా కుదరని పెళ్లి సంబంధాలు

● గ్రామాల్లో, పట్టణాల్లోనూ ఇదే పరిస్థితి

● పెరుగుతున్న పెళ్లికాని ప్రసాదులు

'మా వోడు హైదరాబాద్‌లో జాబ్ చేస్తున్నడు.. నెలకు లక్షన్నర వరకు సంపాదిస్తున్నడు.. పిల్లనికి ఎటువంటి అలవాట్లు లేవు.. ఐదేండ్లయింది.. పిల్లను చూడవట్టి.. ఎంత చూసినా సంబంధం ఖాయం అయితలేదు.. పెండ్లి సంబంధాలు చూసేటోళ్లకు చెప్పినం.. చుట్టాలల్ల చెప్పి ఉంచినం.. చూస్తుండగానే 30 ఏండ్లు దాటినయి.. నెత్తిమీద ఎంట్రుకలు ఊడి పోతున్నయి.. ముందు కట్నం.. గిట్నం అని అన్నం.. తరువాత పిల్ల చేసి ఇస్తే చాలన్నం.. ఇప్పుడయితే మేమే అన్ని ఖర్చులు పెట్టుకుంటం అంటున్నం.. అయినా పిల్ల దొరుకుత లేదు.. వాని ఎక్కడ రాసి పెట్టి ఉందో'.. ఇదీ పెళ్లికాని యువకుల తల్లిదండ్రుల ఆవేదన. రోజురోజుకు పెళ్లికాని యువకుల సంఖ్య పెరిగిపోతోంది. ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా సంబంధాలు కుదరకపోవడంతో యువకులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

■ ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల

గతంలో కన్యాశుల్కం ఇచ్చి వివాహాలు చేసుకునేవారు. తదుపరి వరకట్నం మొదలైంది. సాంప్రదాయంగా ప్రారంభమైన ఈ పద్ధతి ఆడపిల్లల తల్లిదండ్రులకు భారంగా మారింది. ఇప్పుడు పరిస్థితి మారింది. రానురాను ఆడపిల్లల సంఖ్య తగ్గుతుండడంతో వధువులకు డిమాండ్ పెరిగింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో వెయ్యి మంది పురుషులకు 942 మంది నిష్పత్తిలో మహిళలు ఉన్నారు.

■ వధువుల కోసం ప్రయత్నాలు

జీవితంలో ఆనందమయంగా గడపాలని అందరు కోరుకుంటారు. అదే క్రమంలో యువతులు చక్కని ఉద్యోగం చేసే భర్త కావాలని కోరుకుంటున్నారు. ఈ క్రమంలోనే జీవితంలో స్థిరపడాలనే తపనతో ఉడుదాటిపోవడంతో యువకుల వధువుల కోసం వెతుకులాడే పరిస్థితి పెరిగి పోతుంది. ఎక్కడ చూసినా ఎక్కడైనా ఆడ పిల్ల ఉంటే చెప్పండి మా వాడు బెంగళూర్, ముంబై, పుణే సాఫ్ట్‌వేర్ రంగంలో పని చేస్తున్నాడని తల్లిదండ్రులు అడుగుతున్న తీరు తరుచూ కనిపిస్తుంది. గతంలో ఉన్న పట్టింపులకు కూడా మరిచి రాశి, నక్షత్రం, గోత్రం లేమ పట్టింపులు పక్కనపెట్టి, అమ్మాయి బాగుంటే చాలని అడుగుతున్న

● వ్యవసాయం చేసే వారికి ఇబ్బందులు


పెళ్లి విషయంలో వ్యాపారాలు చేసే యువకులతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ ఆధారిత యువకులకు అమ్మాయిలు దొరకడం కష్టంగా మారింది. అబ్బాయి ఉన్నత చదువులు చదివి వ్యవసాయం చేస్తూ బాగా సంపాదిస్తున్నా గ్రామీణ ప్రాంతాల్లో ఉండడానికి అమ్మాయిలు ఇష్టపడడం లేదు. గ్రామాల్లో ఉండే అమ్మాయిలు పట్టణాల్లో సాఫ్ట్‌వేర్, కనీసం ప్రైవేటు ఉద్యోగం చేసే వారిని ఇష్టపడుతున్నారు. గతంలో వరకట్నాలు అబ్బాయిలు అడిగిన వారే పెళ్లిలో చాలని అన్ని ఖర్చులు భరించి పెళ్లి చేసుకుంటున్నారు. మరికొన్ని కుటుంబాలు కులాలను కూడా పట్టించుకోవడం లేదు. అమ్మాయి బాగుండి చదువుకుంటే అగ్రకులానికి చెందిన యువకులు సైతం కులాంతర వివాహాలు చేసుకుంటున్నారు. వారు కూడా ఉన్నారు.

■ మారుతున్న పరిస్థితులు

గతంలో 18 ఏళ్లలోపే ఏ పని చేసినా చేయకపోయినా పెద్దలు వివాహం జరిపించే వారు. ఇప్పుడు మారుతున్న కాలంలో ఉన్నత చదువులు, ఆర్థికంగా స్థిరపడిన తరువాతే వివాహం చేసుకోవాలని భావిస్తుండడంతో 40 ఏళ్లు దాటినా పెళ్లిళ్లు కావడం లేదు. దీంతో వివరకు ఎవరైనా సరే అనుకున్నప్పటికీ అమ్మాయిలు దొరకడం లేదు. యువకులతో పోల్చుకుంటే యువతుల సంఖ్య తక్కువగా ఉండడం కూడా మరో కారణం. రోజురోజుకు మ్యారేజ్ బ్యూరోలు పెరుగుతున్నాయి. మధ్యవర్తులు కమీషన్లు తీసుకుని పెళ్లిళ్లు కుదుర్చుతున్నారు.

■ ఇతర రాష్ట్రాలకు పరుగులు


గతంలో దగ్గరి సంబంధాలు కుదుర్చుకునే వారు. ఇప్పుడు అమ్మాయిల కోసం ఇతర రాష్ట్రాలకు సైతం వెళ్తున్నారు. తెలంగాణ, ఆంధ్రా రాష్ట్రాలే కాకుండా పొరుగున ఉన్న మహారాష్ట్ర, కర్ణాటకలో సంబంధాలు వెదుకుతున్నారు.



ఆర్థికంగా స్థిరపడ్డా అమ్మాయి దొరకడం లేదు

- కీర్తి విజయ్

ఆర్థికంగా నిలదొక్కుకునే వరకు వివాహం చేసుకోవద్దని అనుకున్నాను. వ్యాపారంగా, ఆర్థికంగా స్థిరపడ్డాను. ఇప్పుడు అమ్మాయి దొరకడం లేదు. అమ్మాయిల సంఖ్య రోజురోజుకు తగ్గిపోవడమే కారణంగా అనుకుంటున్నాను.



భ్రూణ హత్యలు తగ్గాలి

- అంజయ్య, న్యాయవాది, జిల్లాల బాలల సంక్షేమ సమితి చైర్మన్

ఆడపిల్లలపై వివక్ష, అపోహాలు తొలగించుకోవాలి. ఆధునిక యుగంలో ఎన్నో మార్పులు వచ్చాయి. భ్రూణ హత్యల వల్ల ఆడమగ నిష్పత్తి దెబ్బతింటుంది. భ్రూణ హత్యలు తగ్గాలి. ప్రస్తుతం వెయ్యిమంది మగపిల్లలకు 942 మంది ఆడపిల్లలు ఉన్నారు. ఇలాగే కొనసాగితే ప్రమాదకర పరిస్థితులు ఏర్పడుతాయి.

కాంగ్రెస్‌లో చేరికలు


కాంగ్రెస్ కండువా కప్పుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

ముత్తారం, ఫిబ్రవరి 17: కాంగ్రెస్‌లో ముత్తారం సింగిల్‌విండో డైరెక్టర్ అల్లం నిర్మల పాపయ్య బ్రదర్స్ శనివారం చేరగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ముత్తారం మాజీ జడ్పీటీసీ నాగినేని జగన్ మోహన్‌రావు ఆధ్వర్యంలో సింగిల్‌విండో డైరెక్టర్ నిర్మల పాపయ్య వారి అన్నదమ్ములు, ముత్తారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు జబ్బర్ శ్రీధర్ బాబు సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ మంత్రి శ్రీధర్‌బాబుపై నమ్మకంతోనే బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన సింగిల్‌విండో డైరెక్టర్లు, బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు పూదరి సర్వేష్ గౌడ్, గుజ్జ గోపాల్ రావు, బుచ్చారావు, యూత్ మండల అధ్యక్షుడు బియ్యాని శివకుమార్, అల్లం రాజేశం ఉన్నారు.

ఇన్‌స్పైర్ పోటీలకు ఏడు ఆవిష్కరణలు ఎంపిక

పెద్దపల్లి కల్చరల్, ఫిబ్రవరి 17: ఇన్‌స్పైర్ రాష్ట్ర స్థాయి ప్రాజెక్టు ప్రదర్శనా పోటీల(2022-23)కు జిల్లా నుంచి ఏడు ఆవిష్కరణలు ఎంపికైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి డి.మాధవి తెలిపారు. ఈ మేరకు ఆన్‌లైన్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చిన విద్యార్థుల వివరాలను శనివారం వెల్లడించారు. త్వరలో జరిగే ఎస్‌ఎల్‌ఇపిసిలో విద్యార్థులు రాణించాలని డీఈవో ఆకాంక్షించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాగినేడుకు చెందిన రంగు కీర్తన (పోర్టబుల్ వీల్ చేర్ ర్యాంప్),సి.హెచ్.రవికుమార్ (బ్లైండ్ స్పాట్ మానిటరింగ్ సిస్టం)లు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికలు జూలపల్లికి చెందిన పిట్టల స్వేత (స్మార్ట్ హ్యాండ్ బ్యాగ్ విత్ ఉమెన్ ప్రొటెక్షన్), తెలంగాణ రాష్ట్ర ఆదర్శ పాఠశాల ధర్మారంకు చెందిన బొంకూరి తమన్నా (విజువల్లీ ఛాలెంజ్డ్ పీపుల్ మెడిసిన్ టైంటేబుల్ బ్యాగ్),పూరెల్ల సిద్ధార్థ (మెషిన్ ఫర్ హెవీ బౌల్స్ లిఫ్టింగ్ అండ్ మూవింగ్)లు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రంగాపూర్‌కు చెందిన లాస్య (వెజిటేబుల్ డిహైడ్రేటర్), ఎం.జె.పి.టి.బి.సి.డబ్ల్యూ.ఆర్.ఇ.ఐ.ఎస్ బాలికలు రామగుండంకు చెందిన దిడ్డి స్పందనలు రూపొందించిన (ఎ డివైస్ టూ అంబులెన్స్) వినూత్న ఎగ్జిబిట్స్ రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. విజేతలైన విద్యార్థులను వారిని ప్రోత్సాహించిన గైడ్ టీచర్లను డీఈవో డి.మాధవి, జిల్లా సైన్స్ అధికారి బి.రవినందన్‌రావులు అభినందించారు. ప్రస్తుత విద్యా సంవత్సరానికి 70 మంది విద్యార్థులు ఇన్‌స్పైర్ అవార్డ్‌కు ఎంపికైనట్లు ఈ సందర్భంగా తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లి కల్చరల్, ఫిబ్రవరి17: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 8న వివిధ రంగాలలో విశేష కృషి, ప్రతిభ కనబరిచిన మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం అవార్డులు అందిస్తుందని, అర్హులైన వారు అవార్డుల కోసం ఫిబ్రవరి 20 లోపు దరఖాస్తులు సమర్పించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, దరఖాస్తులను tgsrcw@gmail.com మెయిల్ ద్వారా గాని, హార్డుకాపీని హైదరాబాద్ లోని కమిషనరేట్ కార్యాలయంలో ఫిబ్రవరి20లోగా సమర్పించాలని, ఇతర వివరాలకు, జిల్లా కలెక్టరేట్‌లోని రూమ్ నెంబర్ 114లో గల మహిళ, పిల్లల, దివ్యాంగుల, వయోవృద్ధుల శాఖ కార్యాలయంలో లేదా 9440852495 సెల్ నెంబర్ నందు సంప్రదించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

'మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి'

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి 17: స్థలం లీజుకు ఇప్పిస్తామని డబ్బులు తీసుకుని మోసం చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని మహనీయుల ఆశయ సాధన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు బొంకూరి కైలాసం డిమాండ్ చేశారు. పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 2017లో గోదావరిఖనిలో సర్వే నంబర్ 709లో 39 గుంటల భూమి లీజుకు ఇస్తామని చెప్పి కమల్ లాహోటి, ఆనంద్ లాహోటి దగ్గర ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మామిడిపల్లి బాపయ్య, రాష్ట్ర అధ్యక్షుడు బొంకూరి మధు, మైసా రాజేష్ డబ్బులు తీసుకున్నారని ఆరోపించారు. ఇద్దరు వ్యక్తుల దగ్గర డబ్బులు తీసుకుని స్థలం లీజు అప్పగించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడ్డారని, లీజు పేరుతో డబ్బులు తీసుకుని మోసం చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని అధికారులను కోరారు. సమావేశంలో అలువాల శంకరయ్య, కండె కరుణాకర్, గంధం శంకరయ్య, ఎందుల్ల ప్రభాకర్, పెరుక రాజేశం, మాచర్ల రమేష్, ఆరేపల్లి క్రాంతి కుమార్, ఆలువాల ప్రశాంత్ పాల్గొన్నారు.

'పెద్దపల్లి బీఆర్‌ఎస్ ఎంపీ టికెట్ ఇవ్వాలి'

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి 17: పెద్దపల్లి ఎంపీ ఎస్సీ రిజర్వ్ స్థానం నుంచి తనకు బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం ఇవ్వాలని పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లికి చెందిన కొంకటి లింగమూర్తి కోరాడు. ఈ మేరకు రాఘవపూర్ బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. మాదిగ సామాజిక వర్గానికి చెందిన తనకు అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశాడు. తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొని, రాష్ట్రం వచ్చాక పార్టీ బలోపేతం కోసం పని చేశానని గుర్తుచేశారు. స్థానికుడినైన తనకు టికెట్ ఇవ్వాలని కోరారు. నియోజకవర్గంలో మాదిగలు పెద్ద సంఖ్యలో ఉన్నారని వివరించారు.

సమ్మక్కకు ప్రత్యేక పూజలు

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి17: మండలంలోని పెగడపల్లి సమ్మక్క-సారలమ్మ జాతరను ఎంపీపీ నూనేటి సంపత్ సందర్శించారు. ఈసందర్భంగా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ జాహెద్‌పాషా, ఎంపీడీఓ రాంమోహనచారి, ఎస్‌ఐ ఓంకార్, విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాస్, ఆరెల్లి రమేష్, సుముఖం మల్లారెడ్డి, జంగా సుఖేందర్‌రెడ్డి, అయిత శ్రీనివాస్, చలిగంటి రామచంద్రం, కొమురయ్య, నాగుల నారాయ్ణ, గోపగోని శ్రీకాంత్, నక్కల గిరి, జంగా తిరుపతిరెడ్డి, జంగా రమణారెడ్డి, గోపగోని రాజయ్య, జంగ శ్రీనివాస్‌రెడ్డి, కొండరాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎస్‌ఐకి సన్మానం

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి17: ఎస్‌ఐ ఓకాంర్‌యాదవ్‌ను గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. మండలంలోని పెగడపల్లి గ్రామంలో శనివారం సమ్మక్క-సారలమ్మ ఏర్పాట్లను పరిశీలించడానికి వచ్చిన ఎస్‌ఐని శాలువాలతో గ్రామస్థులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆరెల్లి సుజాతరమేష్, జంగా రమణారెడ్డి, నక్కల కొమురయ్య, కోంద్ర శ్రీనివాస్, జంగ శ్యామ్‌రెడ్డి, అయిత శ్రీనివాస్ ఉన్నారు.

వామన్‌రావు దంపతులకు ఘన నివాళి

మంథని, ఫిబ్రవరి 17: హత్యకు గురైన హైకోర్టు న్యాయవాద దంపతులు గట్టు నాగమణి-వామనరావు తృతీయ వర్థంతి సందర్భంగా స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో ప్రజాసంఘాలు, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం ఘన నివాళులర్పించారు. కొవ్వొత్తులతో నివాళులర్పిస్తూ న్యాయవాద దంపతులను హత్య చేసిన నిందితులని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈకేసును సీబీఐచే విచారణ చేపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజాసంఘ నాయ కులు, మండల కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షల్లో ప్రతిభ చాటిన యువకుడు


గాదె లెనిన్

కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 17: గోదావరిఖని రాజ్యలక్ష్మికాలనీకి చెందిన గాదె లెనిన్ అనే యువకుడు పలు పోటీ పరీక్షల్లో ప్రతిభ చాటాడు. ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ పరీక్షలో రాష్ట్రస్థాయిలో 12వ ర్యాంక్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పరీక్షలో రాష్ట్ర స్థాయిలో 8వ ర్యాంక్, గ్రూప్-4 పరీక్షలో రాష్ట్రస్థాయిలో 1491 ర్యాంక్ సాధించాడు. కాగా రెండు వారాల క్రితమే సింగరేణి జూనియర్ అసిస్టెంట్ గా విధుల్లో చేరాడు. లెనిన్ తండ్రి గాదె సమ్మయ్య సింగరేణి ఆర్‌జీ-3లో ఎలక్ట్రికల్ ఫోర్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. లెనిన్ గోదావరిఖని, కాలనీలోని శ్రీవైష్ణవి స్కూల్‌లో 10వ తరగతి వరకు చదివి చైతన్య కళాశాలలో ఇంటర్ పూర్తి చేసి వరంగల్ కిట్స్‌లో బీటెక్, హైదరాబాద్ ఐఐటీలో ఎంటెక్ చదివి పోటీ పరీక్షలకు ప్రిపరేషన్ అయ్యాడు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

పెద్దపల్లి ఏసీపీ జి కృష్ణ

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి 17: శాంతి భద్రతలకు ఎవరైనా ఆటంకం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ అన్నారు. శనివారం మండలంలోని మీర్జంపేటలో గల సమ్మక్క-సారలమ్మ జాతర ఏర్పాట్లను ఎస్‌ఐ ఓంకార్‌యాదవ్‌తో కలిపి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ మానేరు ఒడ్డున ఉన్న ఈ జాతర అత్యంత వైభవంగా నడిచే సందర్భంగా భక్తులకు ఎలాంటి ఆటంకాలు కలుగకుండా జాతర కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. తాగునీటి సౌకర్యంలో ఎలాంటి ఇబ్బంది రాకుండా భక్తులకు చూడాలన్నారు. ఎలాంటి అసాంఘిక చర్యలకు పాల్పడ్డ, శాంతిభద్రతలకు ఆటంకం కలిగించినా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. జాతర సందర్భంగా ఎలాంటి గొడవలు రాకుండా అందరూ కలిసికట్టుగా జాతర విజయవంతం చేయాలన్నారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. గతంలో ఎస్‌ఐగా పని చేసి ఇదే పోలీస్‌స్టేషన్‌కు ఏసీపీ హోదాలో రావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ఓంకార్‌యాదవ్‌తోపాటు ఎంపీటీసీ గూడెపు జనార్దన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ పోసాల సదానందం, జాతర కమిటీ చైర్మన్ ఉయ్యాల అశోక్‌గౌడ్, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఉయ్యాల సుమన్‌గౌడ్ ఉన్నారు.


మీర్జంపేటలో జాతర ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పెద్దపల్లి ఏసీపీ కృష్ణ


గోలివాడలో జాతర ప్రదేశాన్ని పరిశీలిస్తున్న గోదావరిఖని ఏసీపీ రమేష్

● సమన్వయంతో పని చేయాలి

సుల్తానాబాద్: వివిధ శాఖల అధికారులతో పాటు ఆయా గ్రామాల సమ్మక్క జాతర కమిటీల నిర్వాహకులు సమన్వయంతో పని చేసి సమ్మక్క జాతరలను ప్రశాంతంగా, ఘనంగా జరుపుకోవాలని పెద్దపల్లి ఏసీపీ జి. క్రిష్ణ పిలుపునిచ్చారు. సుల్తానాబాద్ సర్కిల్ పరిధిలోని సుల్తానాబాద్, ఓదెల, కాల్వశ్రీరాంపూర్, జూలపల్లి, ఎలిగేడు మండలాల్లోని సమ్మక్క జాతర కమిటీల నిర్వాహకులతో కలసి సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్‌లో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఏసీపీ క్రిష్ణ మాట్లాడుతు జాతరల సందర్భంగా మనందిరికీ అమ్మవార్ల సేవ చేసే అదృష్టం కలిగిందని భావిస్తూ భక్తులకు వసతి సౌకర్యాలు కల్పించాలన్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయా గ్రామాల యువతను ప్రజలను భాగస్వామ్యం చేస్తూ జాతరలను విజయవంతం చేయాలన్నారు. జాతరల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాట్లు చేశామని, ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. రోడ్ల మరమ్మతులు, పార్కింగ్ స్థలాల ఎంపికలు, తాగునీటి ఏర్పాటు, స్నానాలు చేసేందుకు కావల్సిన ఏర్పాట్లు, ఇతర పలు అంశాలను సమీక్షించారు. జాతర ప్రాంతాలు సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉంటాయన్నారు. సమావేశంలో సుల్తానాబాద్ సీఐ జగదీష్, ఎస్‌ఐ వినీత, జూలపల్లి ఎస్‌ఐ శ్రీధర్, పొత్కపల్లి ఎస్‌ఐ అశోక్‌రెడ్డి, కాల్వశ్రీరాంపూర్ ఎస్‌ఐ ఓంకార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

● సమ్మక్క జాతర ప్రదేశాన్ని సందర్శించిన ఏసీపీ

అంతర్గాం: అంతర్గాం మండల పరిధిలోని గోలివాడ శివారు గోదావరి తీరంలో ఈ నెల 21 నుంచి 24వరకు జరగనున్న సమ్మక్క-సారలమ్మ జాతర ప్రదేశాన్ని శనివారం గోదావరిఖని ఏసీపీ ఎం రమేష్ సందర్శించారు. ఈ సందర్భంగా భక్తుల సౌకర్యార్థం జాతర ప్రదేశంలో జరుగనున్న ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా సౌకర్యాలు కల్పించాలని జాతర కమిటీ ప్రతినిధులను కోరారు. అనంతరం ఏసీపీ అంతర్గాం పోలీస్ స్టేషన్‌ను సందర్శించి పోలీస్ సిబ్బందితో మాట్లాడారు. రికార్డులు తనిఖీ చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎస్‌ఐ వెంకట్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రామగుండం సీఐ ప్రవీణ్‌కుమార్, తహసిల్దార్ పీ రాంమోహన్, జాతర కమిటీ ప్రతినిధులు పెంద్రు హన్మాన్‌రెడ్డి, ఆవుల గోపాల్‌యాదవ్, కోల రాంమూర్తిగౌడ్, ఎంపీఓ సమ్మిరెడ్డి పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్: మండలంలోని తుర్కలమద్దికుంటలో చేపడుతున్న సమ్మక్క సారలమ్మ జాతరను పకడ్బందీగా నిర్వహించాలని పెద్దపల్లి సీఐ కృష్ణ పేర్కొన్నారు. శనివారం జాతర ఏర్పాట్లను పెద్దపల్లి ఎస్‌ఐ లక్ష్మణ్‌రావుతో కలిసి సీఐ కృష్ణ పరిశీలించారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఆలయ కమిటి సభ్యులు సూచించారు. వైస్ ఎంపీపీ ముత్యాల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

కోల్‌సిటీ: గోదావరిఖని గోదావరి తీరంలోని సమ్మక్క-సారలమ్మ జాతర ఏర్పాటు పనులను శనివారం రాత్రి మేయర్ బంగి అనిల్‌కుమార్, కార్పొరేటర్లు పరిశీలించారు. జాతర పరిసరాల పరిశుభ్రత పటిష్టంగా నిర్వహించాలన్నారు. చెత్తను కాల్చకుండా కాపలా పెట్టాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట కార్పొరేటర్లు కన్నూరి సతీష్‌కుమార్, బాల రాజ్‌కుమార్, బీఆర్‌ఎస్ నాయకులు నీల గణేష్, కాంగ్రెస్ నాయకులు పాతిపెల్లి ఎల్లయ్య, సలీం ఉన్నారు.

భూ నిర్వాసితులతో చర్చలు విఫలం

ముత్తారం, ఫిబ్రవరి 17: మండలం పోతారంలో ఎన్‌హెచ్ 163 జాతీయ రహదారి కింద భూములు పోయే రైతులతో ముత్తారం తహసీల్దార్ సుమన్ జరిపిన చర్చలు విఫలమయ్యాయి. దీంతో సంతకాలు చేసేందుకు రైతులు నిరాకరించారు. జూన్ 2023లో రైతులకు ఇచ్చిన సర్వేలో భాగంగా భూములు కోల్పోయిన రైతులు కొన్ని సమస్యలు లేవనెత్తారు. అప్లికేషన్స్ పెట్టుకున్నారు. సమస్యలను పరిష్కరించకుండా శనివారం ముత్తారం తహసీల్దార్ మరొకసారి రైతులతో ఒప్పంద సంతకాలు చేయించేందుకు సభ ఏర్పాటు చేయగా రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ భూములు సరిచేసి, బావులు, బోర్లు, చెట్లు లెక్కించిన తర్వాతనే పేపర్‌పై సంతకాలు చేస్తామని ప్రజలు సభలో నుంచి వెళ్లిపోయారు. కార్యక్రమంలో జడ్పీటీసీ చెల్కల స్వర్ణలత అశోక్‌కుమార్‌యాదవ్, తహసీల్దార్ సుమన్, డీఐ, సర్వేయర్ లలిత, ఆర్‌ఐ శ్రీధర్, రైతులు పాల్గొన్నారు.

విధినిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు

కోల్‌సిటీ, ఫిబ్రవరి 17: రామగుండం నగరపాలక సంస్థలోని అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని నగర కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ హెచ్చరించారు. శనివారం రెవెన్యూ, ఇంజనీరింగ్ విభాగాల అధికారులతో ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. పన్ను వసూళ్ల మెరుగుపరిచేందుకు ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేంత వరకు సెలవు దినాల్లో కూడా పనిచేయాలన్నారు. మొండి బకాయిదారుల నుంచి పన్ను వసూళ్ల రాబట్టేందుకు చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంజనీరింగ్ విభాగం అధికారులు పనులు వాయిదా వేయకుండా సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం గౌతమినగర్‌లోని డీఆర్‌సీసీ సెంటర్‌ను పరిశీలించారు. యంత్రాలు వినియోగం లేకుండా ఉండడం సరైంది కాదని, వెంటనే వాటిని వినియోగంలోకి తీసుకురావాలని డిప్యూటీ కమిషనర్‌ను ఆదేశించారు. సమీక్షలో డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వర్‌రావు, ఎస్‌ఈ చిన్నారావు, అసిస్టెంట్ కమిషనర్ రాయలింగు, ఈఈ సుచరణ్ తదితరులు ఉన్నారు.

జాతీయ రెజ్లింగ్ పోటీల్లో విజేతగా నిలవాలి

పెద్దపల్లి కల్చరల్, ఫిబ్రవరి 17: పంజాబ్ రాష్ట్రం పటియాలలో 20వ తేదీ నుంచి నిర్వహించే జాతీయ స్థాయి జూనియర్స్ రెజ్లింగ్ పోటీల్లో విజేతగా నిలవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆకాంక్షించారు. కమాన్‌పూర్ మండలం పెంచికల్‌పేటకు చెందిన సాయితేజ ఇటీవల హన్మకొండలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్ 20 రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పెద్దపల్లి జిల్లాకు ప్రాతినిధ్యం వహించి, గ్రీకో రోమన్ 82 కేజీల విభాగంలో స్వర్ణ పతకాన్ని సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా శనివారం కలెక్టరేట్‌లో సాయితేజ కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను కలిసారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయస్థాయి రెజ్లింగ్ పోటీలో పాల్గొనే తెలంగాణ జట్టుకు పెద్దపల్లి జిల్లా రెజ్లర్ సాయి తేజ ఎంపిక కావడం సంతోషకరమన్నారు. రాష్ట్ర స్థాయిలో స్వర్ణ పతకాన్ని సాధించి పెద్దపల్లి కీర్తిని ఇనుమడింపజేసిన సాయి తేజను, ప్రోత్సహిస్తున్న పెద్దపల్లి జిల్లా అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహ్మద్ రఫీ, ఎం.వంశీకృష్ణలను కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ కోశాధికారి శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ సీఎం కేసీఆర్ జన్మదినం

పెద్దపల్లి కల్చరల్ , ఫిబ్రవరి 17 : బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని పెద్దపల్లి పట్టణ శాఖ అధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పాల్గొని కేక్‌కట్ చేశారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పెద్దపల్లి పట్టణంలోని ఆదర్శనగర్‌లోజరిగిన వేడుకల్లో పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్, వైద్య శ్రీనివాస్, యాకూబ్, ఇమామ్ మహబూబ్ పాల్గొన్నారు.

కళ్యాణ్‌నగర్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినం సందర్భంగా గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ, ప్రధాన చౌరస్తాలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో కేక్‌కట్ చేశారు. నిరుపేద విద్యార్థులకు ప్యాకెట్ మనీని అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, మేయర్ బంగి అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ అభిషేక్‌రావు, జడ్పీటీసీ ఆముల నారాయణ, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

● సుల్తానాబాద్/ ధర్మారం/జూలపల్లి/ఎలిగేడు/కాల్వశ్రీరాంపూర్/మంథని/యైటింక్లయిన్‌కాలనీ/రామగిరి: ఆయా మండలాల్లో మాజీ సీఎం, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ జన్మదినం సందర్భంగా పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు.


గోదావరిఖనిలో కేక్‌కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తదితరులు

శ్మశానంలోని ఎముకలు ఎత్తుకెళుతున్న దొంగలు

- పలువురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

సుల్తానాబాద్, ఫిబ్రవరి 17: మండలంలోని శ్మశానాల్లో దొంగలు ఎముకలు ఎత్తుకెళ్తున్నారు. సుల్తానాబాద్ పట్టణంలో వారం రోజుల్లో ఎనిమిది మంది చనిపోయారు. వారి మృతదేహాలను సుల్తానాబాద్‌లోని గట్టేపల్లి రోడ్డులో గల శ్మశాన వాటికల్లో దహనం చేశారు. అయితే మృతుల కుటుంబసభ్యులు తొమ్మిది రోజులకు లేదా ఐదు రోజులకు మృతుడి ఎముకలు, బూడిదను తీసుకుని భద్రపరిచి లేదా అదే రోజు వాటిని కాశీ, కాళేశ్వరం, ధర్మపురి వంటి పుణ్యక్షేత్రంలోని గంగలో కలుపుతారు. కానీ మృతుల బంధువులు మృతుడి ఎముకలు (బొక్కలు) కోసం శ్మశానంలోని కాష్టం కాడికి వెళితే అక్కడ ఎలాంటి ఆనవాళ్లు ఉండడం లేదు. శుక్రవారం సుల్తానాబాద్ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముత్యం సునీత భర్త రమేష్ మరణించడంతో ఆయన అంత్యక్రియలు కూడా అక్కడే నిర్వహించారు. రెండో రోజు కార్యక్రమం కోసం శ్మశానానికి బంధువులకు బొక్కలు బూడిదను గుర్తుతెలియని నలుగురు వ్యక్తులు మూట కట్టుకుంటూ కనిపించారు. వెంటనే వారిని పోలీసులకు అప్పగించామని సుల్తానాబాద్ మాజీ సర్పంచ్ అంతటి అన్నయ్యగౌడ్ తెలిపారు. ఇలాంటి సంఘటనలు మరోసారి జరగకుండా చూడాలని ఆయన పోలీసులను కోరారు. కాగా శ్మశానంలో పట్టు బడిన వారిని విచారిస్తున్నట్లు పోలీసుల తెలిపారు.

ఇసుక లారీలను అడ్డుకున్న గంగాపురి గ్రామస్థులు


ఇసుక లారీని అడ్డుకున్న గ్రామస్థులు

మంథని, ఫిబ్రవరి 17: నిత్యం వందలాది ఇసుకల లారీల రాకపోకలతో అధికంగా దుమ్ము, ధూళి లేచి ప్రతీ రోజు నరకం అనుభవిస్తున్నామంటూ.. మంథని మున్సిపల్ పరిధిలోని గంగాపురి గ్రామస్థులు ఇసుక లారీలను శనివారం సాయంత్రం అడ్డుకున్నారు. రోడ్డుపై ట్రాక్టర్ మిషన్‌ను అడ్డుపెట్టి గంగాపురి ప్రజలు తమ నిరసనను వ్యక్తం చేశారు. దీంతో గంగాపురి నుంచి మండలంలోని లక్ష్మీపూర్ గ్రామం వరకు భారీ సంఖ్యలో లారీలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ.. ముత్తారం మండలం ఓడెడ్, ముత్తారం గ్రామానికి సంబంధించిన ఇసుక క్వారీల నుంచి నిత్యం వందలాది లారీలు రాకపోకలు కొనసాగిస్తున్నాయన్నారు. అధిక సంఖ్యలో లారీలు వెళ్లడంతో ఈ రహదారి మొత్తం గుంతలమయంగా మారి పోయిందన్నారు. ఎక్కువ సంఖ్యలో లారీల రాక పోకలు కొనసాగుతుండటంతో దుమ్ము, ధూళి అధికంగా లేస్తుండటంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న పత్తి చేన్లు పూర్తిగా దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అంతే కాకుండా ఇళ్లలోకి సైతం దుమ్ము, ధూళి చేరుతుండటంతో నిత్యం నరకయాతన అనుభవిస్తున్నామన్నారు. లారీల రాకపోకలను దృష్టిలో పెట్టుకొని దుమ్ము లేవకుండా ప్రతీ రోజు రోడ్డుపై వాటర్ కొట్టాల్సిన కాంట్రాక్టర్ ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎంపీడీవోను కలిసిన కార్యదర్శులు

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 17: మండల అభివృద్ధి అధికారిగా విధుల్లో చేరిన శ్రీనివాస్‌గౌడ్‌ను పెద్దపల్లి మండల పంచాయతీ కార్యదర్శులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవోను కలిసి స్వాగతం పలికారు.

క్రైస్తవులపై దాడులను ప్రభుత్వం అరికట్టాలి

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 17: రాష్ట్రంలో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను ప్రభుత్వం అరికట్టాలని ఐపీఎఫ్ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా జన్వాడ్‌లో క్రైస్తవులపై దాడులు జరుగడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. జన్వాడ్‌లో జరిగి న ఘటనలో బాధితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పాస్టర్లు రవిపాల్, డిలైట్, ప్రహర్షి, సోలేమాన్, రాజు, గాబ్రియల్, రవి వర్మ, ప్రసన్న కుమార్, జాన్, ప్రకాష్, ఇబ్రాయిల్, డేవిడ్, స్టెఫిన్ పాల్, అభిషేక్ పాల్, అరుణ్ పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

మార్కండేయకాలనీ, ఫిబ్రవరి 17: కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న గోదావరిఖని ప్రెస్‌క్లబ్ బాయ్ దస్తగిరికి శనివారం వీహెచ్‌ఆర్ ఫౌండేషన్ ఆర్థిక సహాయం అందజేసింది. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వ్యాళ్ల హరీష్‌రెడ్డి ఆదేశాల మేరకు అతని తల్లిదండ్రులు పాలకుర్తి ఎంపీపీ వ్యాళ్ల అనసూర్య, రాంరెడ్డి శనివారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో దస్తగిరికి ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు పూదరి కుమార్, పందిళ్ల శ్యాంసుందర్ పాల్గొన్నారు.

పరామర్శ

సుల్తానాబాద్, ఫిబ్రవరి 17: ఇటీవల మృతిచెందిన మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు కుటుంబాన్ని పట్టణంలోని ఆయన నివాసంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి శనివారం పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులకు సంతాపం సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట నాయకులు కొంగల రాజిరెడ్డి, సాయిరాం గౌడ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను మోసం చేసిన ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ

సీఐటీయూ ఆర్జీ-1 కార్యదర్శి మెండె శ్రీనివాస్




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మెండె శ్రీనివాస్

గోదావరిఖని, ఫిబ్రవరి 17: దేశ వ్యాప్తంగా శుక్రవారం నిర్వహించిన సమ్మెలో ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ సమ్మెలో పాల్గొనకుండా కార్మికులను మోసం చేసిందని, ఎక్కడా కూడా ప్రచారం నిర్వహించలేదని సీఐటీయూ ఆర్జీ-1 కార్యదర్శి మెండె శ్రీనివాస్ విమర్శించారు. శనివారం సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రామగుండం, శ్రీరాంపూర్, మందమర్రి ఏరియాల్లో యాజమాన్యంతో రెండు సంఘాలు లాలూచిపడి సమ్మె రోజున కేవలం నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం చేపట్టి కార్మికవర్గాన్ని అయోమయానికి గురిచేయడం సరికాదన్నారు. రెండు కార్మిక సంఘాలు గెలువక ముందు ఒక మాట, గెలిచిన తరువాత ఒక మాట మాట్లాడుతూ ద్వంద్వ విధానాలకు పాల్పడుతున్నాయన్నారు. కార్మిక హక్కుల కోసం పోరాటం చేసే సీఐటీయూను విమర్శిస్తే ఊరుకునేది లేదని, కార్మికవర్గంలో రోజుకురోజుకు సీఐటీయూకు వస్తున్న ఆధరణ చూసి ఓర్వలేక అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. రాబోయే కాలంలో కార్మికులే ఈ సంఘాలకు బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో ఆరెపల్లి రాజమౌళి, గౌస్, నంది నారాయణ, శంకర్, మల్లేష్, వెంకటేశ్వర్లు, రహీంఖాన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విధులు నిర్వహించండి: ఆర్జీ-2 జీఎం


అభ్యర్థిని సన్మానిస్తున్న జీఎం సూర్యనారాయణ

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 17: పోలీస్‌శాఖలో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు క్రమశిక్షణతో విధులు నిర్వహించి తల్లిదండ్రులకు, సింగరేణి సంస్థలకు మంచి పేరు తీసుకురావాలని ఆర్జీ-2 జీఎం ఎల్‌వీ సూర్య నారాయణ అన్నారు. పోలీస్ శాఖలో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల అభినందన కార్యక్రమం శనివారం జీఎం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను శాలువాలతో సన్మానించారు. అభ్యర్థులనుద్దేశించి జీఎం మాట్లాడారు. సింగరేణి సేవా సమితి ఆర్జీ-2 ఆధ్వర్యంలో అనుభవజ్ఞులైన శిక్షకులతో శారీరక, దారుఢ్య శిక్షణ, స్టడీ మెటీరియల్ అందించగా సద్వినియోగం చేసుకున్న అభ్యర్థులను అభినందించారు. కార్యక్రమంలో ఆర్జీ-2 బ్రాంచి కార్యదర్శి జిగురు రవీందర్, సీఎంవోఏఐ ప్రతినిధి రాంరెడ్డి, డీజీఎం పర్సనల్ రాజేంద్రప్రసాద్, డీవైపీఎం వేణుగోపాల్, సీనియర్ సెక్యూరిటీ అధి కారి షరీఫ్ మహ్మద్, ఫిజికల్ ట్రైనర్స్ దేవరెడ్డి, హనిఫ్, సురేష్ పాల్గొన్నారు.



భద్రతతో విధులు నిర్వహించాలి: సేఫ్టీ జీఎం

రామగిరి, ఫిబ్రవరి 17: గనుల్లో పనిచేసే సమయాల్లో భద్రతతో కూడిన పనివిధానం అవలంబించాలని సేఫ్టీ జీఎం గురువయ్య అన్నారు. రామగుండం సేఫ్టీ రీజియన్‌గా అదనపు బాధ్యతలు చేపట్టిన రామగుండం జీఎం సేఫ్టీ కె.హెచ్.ఎన్. గుప్తాతో కలిసి తొలిసారిగా శనివారం ఏపీఏ డివిజన్ పరిధిలో ఏఎల్‌పీ ప్రాజెక్టును వారు సందర్శించారు. ఈ సందర్భంగా లాంగ్‌వాల్ డెవలప్‌మెంట్ భద్రతపై తీసుకుంటున్న చర్యలను పర్యవేక్షించారు. చైర్ లిఫ్టింగ్ సిస్టం 87 లెవల్ వరకు తనిఖీ చేశారు. అనంతరం జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సేఫ్టీ జీఎం గుప్తాను ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు, ప్రాజెక్టు అధికారి నాగేశ్వర్‌రావు, అధికారులు ఘనంగా సత్కరించారు.

మొక్కలతోనే మానవ మనుగడ

కాసిపేట, ఫిబ్రవరి 17: మొక్కలతోనే మానవ మనుగడ అని సింగ రేణి ఎస్‌వోటూ డైరెక్టర్ నాగేశ్వర్‌రావు అన్నారు. శనివారం ఆయన కాసి పేట1వ గనిని సందర్శించారు. గని ఆవరణలో మొక్కలు నాటారు. కాసి పేట టన్నెల్ మెయిన్ పనులను, మ్యాన్ రైడింగ్ ఏర్పాట్లను ఆయన పర్య వేక్షించారు. ఆయన మాట్లాడుతూ టన్నెల్ పనుల్లో వేగం పెంచి మ్యాన్ రైడింగ్‌ను త్వరగా పూర్తిచేయాలన్నారు. మొదటిసారిగా వచ్చిన ఆయనను కార్మికనాయకులు, అధికారులు ఘనంగా సన్మానించారు. గనిమేనేజర్ అల్లావుద్దీన్, ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్ పాల్గొన్నారు.

బొగ్గు గనులు సింగరేణికి కేటాయించండి

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 17: తెలంగాణ ప్రాంతంలోని బొగ్గు గనులను సింగరేణికి కేటాయించాలని కోరుతూ ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వి సీతారామయ్య కోరారు. ఓసీపీపై ఈకోపార్క్ ప్రారంభించడానికి వచ్చిన కేంద్ర బొగ్గుశాఖ కార్యదర్శి అమిత్‌లాల్ మీనాకు ఆయన వినతిపత్రం అందించారు. కాంట్రాక్టు కార్మికులకు హైపర్‌కమిటీ వేతనాలు అందించాలని, కోల్ ఇండియా మాదిరిగా ఆదాయపు పన్నుపై మినహాయింపు ఇవ్వాలని కోరారు.